ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 04.10.2024 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తిరుమల తిరుపతి ఆలయం ప్రసాదం లడ్డూల్లో కల్తీ నెయ్యి వాడకంపై వచ్చిన ఆరోపణలను ప్రత్యేక స్వతంత్ర దర్యాప్తు బ్రుందంతో విచారణ జరిపించాలని సుప్రీంకోర్టు ఈరోజు ఆదేశించింది.

2. రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు త్వరలోనే సన్న బియ్యాన్ని అందిస్తామని మంత్రి సీతక్క తెలిపారు.

3. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ ప్రక్రియ ఇప్పటికీ పూర్తి చేయలేదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు విమర్శించారు.

4. జనగామ జిల్లాలో మైనర్ బాలికలపై జరిగిన అత్యాచరం ఘటనతో రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని తెలుస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు.

**<u>తిరుమల-లడ్డు- సుప్రీంకోర్టు</u>**

ఆంధ్రప్రదేశ్ లోని తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయం ప్రసాదం లడ్డూల్లో కల్తీ నెయ్యి వాడకంపై వచ్చిన ఆరోపణలపై ప్రత్యేక స్వతంత్ర దర్యాప్తు బ్రుందంతో విచారణ జరిపించాలని సుప్రీంకోర్టు ఈరోజు ఆదేశించింది. ఈ స్వతంత్ర సిట్ బృందంలో ఇద్దరు సీబీఐ , అధికారులు ఇద్దరు ఆంధ్రప్రదేశ్ పోలీస్ అధికారులు భారత ఆహార భద్రతా ప్రమాణాల ప్రాధికార సంస్థ సీనియర్ అధికారి ఒకరు సభ్యులుగా ఉంటారని తెలిపింది. సిబిఐ డైరెక్టర్ పర్యవేక్షణలో ఈ దర్యాప్తు జరుగుతుంది. బీజేపీ నాయకుడు సుబ్రహ్మణ్యం స్వామి , రాజ్యసభ సభ్యుడు

తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి , చరిత్ర కారుడు విక్రమ్ సంపత్ , ఆధ్యాత్మిక ప్రవచనకర్త దుష్యంత్ శ్రీధర్ తో సహా అనేకమంది దాఖలు చేసిన వివిధ పిటిషన్లపై కోర్టు విచారణ జరిపింది. ఈ వ్యవహారంపై వచ్చిన ఆరోపణలు , ప్రత్యారోపణలపై తనకు ప్రత్యేకంగా ఎటువంటి అభిప్రాయం లేదని, కోర్టు నిర్ణయాన్ని రాజకీయ పోరాటాలకు కారణంగా వాడుకోరాదని స్పష్టం చేసింది. కోట్లాదిమంది భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకునే తాను ఈ ఉత్తర్వులు జారీచేస్తున్నట్టు తెలియజేసింది. కాగా, సుప్రీంకోర్టు నిర్ణయాన్ని టీటీడీ మాజీ చైర్మన్లు భూమన కారుణాకర్ రెడ్డి , వైవీ సుబ్బారెడ్డి స్వాగతించారు. సర్వోన్నత న్యాయస్థానం ఏర్పాటు చేసిన దర్యాప్తు బ్రుందంతో వాస్తవాలు బయటికి వస్తాయని తెలిపారు.

(ఎస్ ఎస్ డీ)

<u>**వరంగల్ -మంత్రి సీతక్క**</u>

రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు త్వరలోనే సన్న బియ్యాన్ని అందిస్తామని రాష్ట్ర పంచాయితీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. 500 క్వింటాకు రూపాయల బోనస్ తో సన్నవడ్లను కొనుగోలు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ రాష్ట్ర ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేతో పాటు వరంగల్ జిల్లాలో 12 కోట్ల 43 లక్షల విలువ చేసే రోడ్ల శంకుస్థాపన , వన మహోత్సవం వంటి కార్యక్రమాల్లో నిన్న మంత్రి పాల్గొన్నారు. వర్ధన్నపేట ఎంఎల్ఏ నాగరాజు ,ఎంపీ కడియం కావ్య లతో కలిసి పర్వతగిరి మండల పరిధిలోని చౌటపల్లి గ్రామంలో పలు గ్రామాల రోడ్ల పనులకు శంఖు స్థాపన చేశారు. పర్వతగిరి మండల పరిధిలోని చౌటపల్లి గ్రామంలో వన మహోత్సవం లో భాగంగా చెట్లను నాటారు. ఫ్యాక్స్ నూతన భవనము , 500 మెట్రిక్ టన్నుల గోదాముల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలి అన్నారు.

(పీటీసీ, వరంగల్)

**రుణమాఫీ-కేటీఆర్**

రాష్ట్రంలో వంద శాతం రుణమాఫీ పూర్తి చేశామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన డొల్ల మాటలేనని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు విమర్శించారు. రాష్ట్రంలో 20 లక్షల మందికి రుణమాఫీ కాలేదన్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటనతో ఈ విషయం బయట పడిందంటూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఓ వైపు డిసెంబర్ 9న ఏక కాలంలో చేస్తామని ప్రకటించిన ప్ర భుత్వం 10 నెలలైనా ఇంకా 20 లక్షల మందికి అందించకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. 2 లక్షల రూపాయల లోపు రుణమాఫీ పూర్తయిపోయిందన్న ప్రకటన నయవంచనేనని ఆరోపించారు.

(డెస్క్)

**కొత్తగూడెం-ఫ్యామిలీ డిజిటల్ కార్డులు**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే రెండో రోజు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొనసాగుతోంది. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ జిల్లాలోని నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించి సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్నారు. కుటుంబ డిజిటల్ కార్డు జారీ చేసేందుకు పైలెట్ ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో ఏడు గ్రామాలు , మూడు మున్సిపాలిటీ ల లోని వార్డుల్లో ఈ సర్వే జరుగుతోందని తెలిపారు.

(పీటీసీ, కొత్తగూడెం)

**సంగారెడ్డి -డిజిటల్ కార్డుల సర్వే**

సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని తోపుకొండ గ్రామంలో కుటుంబ సభ్యుల వివరాల సేకరణ, డిజిటల్ కార్డుల జారీ కోసం చేపట్టిన సర్వేను జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. సర్వే ప్రక్రియను సమగ్రంగా , పొరపాట్లు లేకుండా పూర్తిచేయాలన్నారు. సర్వే

నిర్వహణ పద్ధతులను పరిశీలించేందుకు అధికారులతో కలసి గ్రామాన్ని సందర్శించారు.
(పీటీసీ, సంగారెడ్డి)

**<u>ప్రధానమంత్రి జన్ మన్ పనులు- ఆసిఫాబాద్ జిల్లా</u>**

ప్రధానమంత్రి జన్ మన్ పథకంలో భాగంగా ఆసిఫాబాద్ జిల్లాలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ప్రధానమంత్రి జన్ మన్ పనుల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో పి.వి.టి.జి. గ్రామాలలో మల్టీ పర్పస్ కమ్యూనిటీ భవనాల నిర్మాణంలో టెండర్ దశలో ఉన్న వాటి వివరాలతో నివేదిక అందించాలని , పి.వి.టి.జి.ల కొరకు 3 వేల 600 ఇండ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు

(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)

**<u>కామారెడ్డి-కలెక్టర్</u>**

కామారెడ్డి జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్ లో 356 ధాన్యం కొనుగోళ్ళు కేంద్రాల ఏర్పాటు చేస్తున్నట్లు, కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. జిల్లా కలెక్టరేట్ లో సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడుతూ క్వింటాలు ధాన్యానికి కనీస మద్దతు ధర గ్రేడ్-ఏ రకానికి గాను 2 వేల 320 రూపాయలు , కామన్ రకానికి 2 వేల 300 రూపాయలు కల్పించిందన్నారు. సన్న వడ్లు విక్రయించే రైతులకు అదనంగా క్వింటాల్ కు 500 రూపాయలు ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలను పరిష్కరించడానికి జిల్లా కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్ 08468-220051 ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

(పిటిసి,రాజన్న సిరిసిల్ల జిల్లా)

**<u>ఆసిఫాబాద్-ఆసుపత్రి</u>**

ఆదివాసి గిరిజన ప్రాంతాల్లో రోగులను 30 నిమిషాలలోనే ఆసుపత్రికి చేర్చాలని లక్ష్యంతో మన్ననూరు, భద్రాచలం, ఏటూరునాగారం తో పాటు , ఉట్నూర్ ఐటిడిఏ పరిధిలో ఒక్కొక్కటి చొప్పున 4 ఆసుపత్రులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే , ఇతర జిల్లాలతో పోలిస్తే ఆసిఫాబాద్ లో వైద్య సౌకర్యాల లేక ఆదివాసీ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలో ఏర్పాటు చేసే ఆసుపత్రి ఆసిఫాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో నెలకొల్పాలని జిల్లాలోని ఆదివాసీలు కోరుతున్నారు. ప్రభుత్వంతోపాటు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, ఇతర అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా ఆదివాసి సంఘం నాయకులు కోరుతున్నారు.

(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)

**హరీశ్ రావు-మైనర్ బాలికల అత్యాచారం**

రాష్ట్రంలో మహిళలకు భద్రత కరవైందని మాజీ మంత్రి , బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. భద్రత కల్పించాల్సిన ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందన్నారు. హైదరాబాద్ లోని సైదాబాద్ బాలికల పునరావాస కేంద్రం నుంచి పారిపోయిన ఇద్దరు మైనర్ బాలికలపై జగగామలో జరిగిన అత్యాచార ఘటన వార్త తనను తీవ్రంగా కలచివేసిందని సామాజిక మాధ్యమం ఎక్స్ లో పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదని సాక్షాత్తూ అసెంబ్లీ వేదికగా రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించినా నిర్లక్ష్యం వీడలేదని ఆయన విమర్శించారు. హోం మంత్రిత్వ శాఖను కూడా తానే నిర్వహిస్తున్నప్పటికీ రాష్ట్రంలో శాంతి భద్రతలను పరిరక్షించడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.

(డెస్క్)

**కొత్తగూడెం-డీఎస్సీ పరిశీలన**

డీఎస్సీ 2024 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన సమర్థవంతంగా నిర్వహించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. స్థానిక సింగరేణి ఉన్నత పాఠశాలలో ధ్రువపత్రాల పరిశీలన సరళిని పరిశీలించారు. వివిధ కౌంటర్లలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేస్తున్న సిబ్బందితో మాట్లాడారు.

(పీటీసీ, కొత్తగూడెం)

**<u>వాతావరణం</u>**

రాష్ట్రంలో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. పలు జిల్లాలకు పసుపు హెచ్చరికను జారీ చేసింది. ఈ రోజు ఆదిలాబాద్ , నిర్మల్, నిజామాబాద్, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి , రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్–మల్కాజ్ గిరి , వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్నగర్, నాగర్కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రేపు కూడా ఈ జిల్లాలకు పసుపు హెచ్చరిక ను వాతావరణ శాఖ జారీ చేసింది.

(డెస్క్)

**<u>సిరిసిల్ల-ఇంటర్వ్యూలు</u>**

టామ్కామ్ సంస్థ ద్వారా దుబాయిలో డెలివరీ బాయ్స్ ఎంపిక కోసం రేపు రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణంలోని అంబేడ్కర్ భవన్ లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రాఘువేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9440051285, 9440048500 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)

**<u>సిరిసిల్ల-క్రీడలు</u>**

క్రీడలు మానసికోల్లాసానికి ఎంతగానో దోహదప డతాయని 17వ బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాస్ రావు అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా  సిరిసిల్ల పట్టణ పరిధిలోని సర్దాపూర్ 17వ బెటాలియన్ లో బెటాలియన్ ఇంటర్ కంపెనీస్ క్రీడా పోటీలను ఈ రోజు ప్రారంభించారు. విధి నిర్వహణలో పోలీస్ సిబ్బంది తీరిక లేకుండా విధులు నిర్వహిస్తున్నారని  అన్నారు. పోలీస్ సిబ్బంది మానసికోల్లాసం కోసం ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు వెల్లడిం చారు.

(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)

**ఆదిలాబాద్-నైపుణ్య శిక్షణ**

భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న తాపీ మేస్త్రీలకు ఇస్తున్న నైపుణ్య శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ నాగేంద్రం  కోరారు. జిల్లా కేంద్రంలో  15 రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. శిక్షణ తర్వాత ఇచ్చే ధ్రువపత్రాలు ఇతర దేశాల్లో కూడా పనిచేస్తాయని తెలిపారు.

(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)

**వేములవాడ-నవరాత్రి**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజ రాజేశ్వర  స్వామి ఆలయంలో జరుగుతున్న దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు శుక్రవారం అమ్మవారు బ్రహ్మచారిణి అలంకారంలో దర్శనమిచ్చారు. వేద పండితుల మంత్రోచ్చారణల  మధ్య బ్రాహ్మణోత్తములు పూజలు చేశారు.అమ్మవారు బ్రహ్మచారిణి అలంకారంలో దర్శనం ఇవ్వడంతో,  భక్తులు పెద్ద సంఖ్యలో  తరలివచ్చి అమ్మవారిని తరించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

(పీటీసీ, సిరిసిల్ల)

**సీఎం సహాయ నిధి**

వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి విన్స్ బయో ప్రోడక్ట్స్ సంస్థ 51 లక్షల రూపాయల విరాళం అందించింది. విన్స్ బయో ప్రోడక్ట్స్ చైర్మన్ శ్రీదాస్ నారాయణ దాస్ డాగ , కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సిద్ధార్థ డాగ జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రిని కలిసి ఆయనకు చెక్కును అందజేశారు. వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు అండగా విరాళం అందించినందుకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వారిని అభినందించారు.

(HYD- PTC))

**మూసీ-భువనగిరి ఎంపీ**

మూసీ నది ప్రక్షాళన గురించి చర్చించి రాష్ట్ర ప్రభుత్వానికి సహకరిద్దామని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ నేపథ్యంలో రేపు హైదరాబాద్, నాగోల్ లో సాయంత్రం 4 గంటలకు జరిగే మూసినది పరివాహక ప్రాంత రైతుల సమావేశానికి స్వచ్ఛందంగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఓ ప్రకటనలో కోరారు.

(పీఎన్)